క్లుప్తంగా

కల్యాణ వేడుకలకు ప్రముఖుల హాజరు



గూడూరు: మండలంలోని మధనాపురం గ్రామంలో సోమవారం గోదారంగనాథుల కల్యాణ వేడుకలకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ దంపతులు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. వారికి ఆలయ ధర్మకర్త, బీజేపీ నాయకుడు లింగాల సుధీర్‌రెడ్డి దంపతులు ఘనస్వాగతం పలికారు. ప్రజలంతా క్షేమంగా ఉండాలని వేడుకున్నారు.

ట్రైసైకిల్ అందజేత

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఏర్పుల ఉప్పలయ్య అనారోగ్య కారణంగా ఎడమ కాలు పూర్తిగా తొలగించారు. ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వం స్పందించలేదని ఉప్పలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఉప్పలయ్య బాధ చూడలేక గ్రామానికి చెందిన చిర్రగోని కిరణ్ రూ.8వేలతో ట్రైసైకిల్‌ను సోమవారం అందించాడు.

ప్రియాంకా గాంధీని కలిసిన యశస్వినిరెడ్డి



తొర్రూరు: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీని ఢిల్లీలోని ఆమె నివాసంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

మల్లికార్జునస్వామి జాతర



గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు దేవుని గుట్టపై ప్రతీ సంవత్సరం మల్లికార్జున స్వామి జాతరను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. సోమవారం జాతర కమిటీ పెద్దలు నర్సయ్య, రాములు, వెంకటేశ్, ఉప్పలయ్య, అయిలయ్య, మల్లేష్, మల్లయ్య మేళతాళాల నడుమ పూజా సామగ్రిని గుట్టపైకి చేర్చారు. అనంతరం పూజారులు రమణశాస్త్రి, రాజుశాస్త్రి వేదమంత్రోచ్ఛరణల నడుమ ఉత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వర్గీకరణ అమలు చేయాలి



పెద్దవంగర: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్ మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సంఘం మండల అధ్యక్షుడు ఈదురు సైదులు మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న కవుల, కళాకారుల రథయాత్ర ఈనెల 15న మండల కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకన్న, రవి, మహేష్, శ్రీను, మధు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా సోమవారం తెల్లవారు జామున 3 గంటల నుంచి పలు గ్రామాల్లో ప్రజలు భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో కట్టెలతో భోగి మంటలు పెట్టి పాడైన వస్తువులతోపాటు చిల్లర డబ్బులు అందులో వేసి మంచి జరగాలని అగ్నిదేవుడిని కోరుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటలు



దోర్నకల్: శాంతినగర్‌లో భోగి మంటలు



కేసముద్రంలో ఆకట్టుకున్న ముగ్గు



చిన్నగూడూరు: చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న తల్లి



గూడూరు: భోగి మంటలు వేస్తున్న ప్రజలు



చిన్నగూడూరు: పతంగులతో చిన్నారులు..



దంతాలపల్లి: గంగిరెద్దుతో గ్రామస్తులు



మహబూబాబాద్ అర్బన్: టైర్ల ఆట ఆడుతున్న కాళోజీ వాకర్స్ సభ్యులు

హైవేపై లీకేజీ..



రోడ్డుపై ప్రవహిస్తున్న లీకేజీ నీరు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరు వాగు సమీపంలోని మహబూబాబాద్–సూర్యాపేట 365 జాతీయ రహదారిపై పైపులైన్ లీకేజీ అవుతుంది. మట్టి రహదారి అంతా బురదగా ఏర్పడి వాహనదారులకు ప్రాణాపాయంగా మారింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రహదారి అర కిలోమీటరు మేర ఆకేరువాగు ఉధృతికి కొట్టుకుపోయింది. ఈ క్రమంలో తాత్కాలికంగా మట్టి పోసి వాహన రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఇప్పుడు అదే ప్రాంతంలోని నేషనల్ హైవేపై వ్యవసాయానికి సంబంధించిన పైపులైన్ లీకేజీ అయి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఎక్కడ జారి పడుతామో.. ఏ ప్రమాదం పొంచి ఉందోనని వాహనదారులు తమ ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నూతన వ్యవసాయ బిల్లును రద్దు చేయాలి

మహబూబాబాద్/బయ్యారం: నూతన వ్యవసాయ మార్కెట్ ముసాయిదా బిల్లును వెంటనే రద్దు చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, పలు సంఘాల నాయకులు చిన్న చంద్రన్న, నల్లు సుధాకర్, మేక వీరన్న డిమాండ్ చేశారు. సంయుక్తా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి బిల్లు పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జు దేవేందర్, ఐలయ్య, యాకయ్య, రాజన్న, చింతకుంట్ల వెంకన్న సక్రు, సత్యం పాల్గొన్నారు.

గంగారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన వ్యవసాయ మార్కెట్ల విధానాన్ని నిరసిస్తూ ఉద్యమాలను తీవ్రతరం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ అన్నారు. మండలంలోని కోడిశలమిట్ట గ్రామంలో మార్కెట్ ముసాయిదా పత్రాలను సోమవారం దహనం చేశారు. కార్యక్రమంల నాయకులు భిక్షం, వీరస్వామి, నాగేశ్వర్‌రావు, శ్రీను, నారాయణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్: బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళనలు

నెహ్రూసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఆందోళనలు తప్పవని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అశోక్ అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు గోపన్న, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు సోమవారం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దున్నేవాడికి భూమి కావాలని, భూమి, భుక్తి కోసం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు సాగించి వేల ఎకరాల భూమిని ప్రజలకు పంచిన ఘనత పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాపరెడ్డి, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.మధార్, డి.ఉపేందర్, ఆలకుంట్ల సాయిలు, భిక్షపతి, దొడ్డ రాజు, భూక్య లక్ష్మణ్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అశోక్

‘క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది’



పెద్దవంగర: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

పెద్దవంగర: క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం మరింత పెంపొందుతుందని ఎస్సై క్రాంతి కిరణ్ అన్నారు. ఇటీవల మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కారోబార్ బైన రవికుమార్ మృతి చెందగా ఆయన స్మారకార్థం తెలంగాణ యూత్ అధ్యక్షుడు నీలం సాంబయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎస్సై పోటీలను ప్రారంభించారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

కొత్తగూడ: యువత అన్ని రంగాల్లో రాణించాలని కొత్తగూడ, గంగారం ఎస్సైలు కుశకుమార్, రవికుమార్ అన్నారు. మండలంలోని తాటివారివేంపల్లి గ్రామ యువజన సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. మద్యం, మాదక ద్రవ్యాల నుంచి యువత దూరంగా ఉండాలని సూచించారు. ఉపాధి కల్పనకు పోలీస్ శాఖ నుంచి కావాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం వాలీబాల్ కిట్ అందజేశారు.

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో ఎస్‌ఎఫ్‌ఐ-డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో క్రీడలు, ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయగా సోమవారం ఏఎస్సై వెంకన్న పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కడియం సత్యం, పట్ల మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్వారులకు పూజలు

మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజా వేడుకలు, అధ్యయనోత్సవంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయంలో ఆళ్వారులకు ప్రత్యేక పూజలు జరిగాయి. వైష్ణవ సంప్రదాయానికి పునాదులైన ఆళ్వారులకు అర్చకులు ఆధ్యయన ఉత్సవ పూజలు నిర్వహించారు. శ్రీ రుక్మిణిసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారికి, శ్రీగోదాదేవి అమ్మవారికి శాస్త్రోక్తంగా ద్రావిడ ప్రబంధ సేవాకాలం పూజలు జరిగాయి. గోదాదేవి అమ్మవారిని పెండ్లి కూతురుగా తయారుచేసి పట్టు వస్త్రాలతో, ఆభరణాలతో, గజమాలతో అలంకరించి పూజలు చేశారు. పౌర్ణమి సందర్భంగా అర్చకులు భాగవతుల వంశీకృష్ణమాచార్యులు, సత్యం గౌతం మహారాజ్ భక్తిశ్రద్ధలతో సుదర్శన యజ్ఞం నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

గోదారంగనాథస్వామి కల్యాణం

ధనుర్మాసోత్సవాల సందర్భంగా సోమవారం గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపానికి మేళతాళాలతో తీసుకొచ్చి ఆలయ పూజారులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ తంతును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



గార్ల: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణం



మహబూబాబాద్ రూరల్: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గూడూరులో గోదారంగనాథుల కల్యాణం



మరిపెడ: కల్యాణం తిలకిస్తున్న భక్తులు



కేసముద్రం: అమీనాపురం ఆలయంలో..

ప్రాణం తీసిన చేపల వేట..



గణేశ్ (ఫైల్)

మరిపెడ రూరల్: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మరిపెడ మండలం ఎడ్జెర్ల రెవెన్యూ పరిధిలోని గుర్రప్పతండా గ్రామ పంచాయతీ పరిధిలో సంక్రాంతి పండుగ రోజు సోమవారం చోటుచేసుకుంది. కథనం ప్రకారం.. మండలంలోని గుర్రప్పతండా గ్రామ పంచాయతీకి చెందిన హలావత్ గణేశ్ (గాంధీ) (26) అదే తండాకు చెందిన యువకులతో కలిసి తండా సమీపంలో ఉన్న ఆకేరు వాగులోకి చేపల వేటకు వెళ్లారు. అక్కడ విద్యుత్ తీగలు ఉపయోగించి వాగులో చేపలు పడుతుండగా అదే విద్యుత్ తీగ తగిలి గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పండుగ పూట గణేశ్ మృతి చెందడంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దొరికిన కోళ్ల దొంగలు

దంతాలపల్లి: నాటు కోళ్లకు మంచి గిరాకీ ఉండడంతో కోళ్లను దొంగిలించి అడ్డంగా దొరికిపోయారు. వివరాలు.. మండలంలోని రాంపురం రైతులు కొమ్ము చంద్రశేఖర్, కొత్తపల్లి రైతు నాగయ్యలు వ్యవసాయ క్షేత్రాల వద్ద నాటు కోళ్లు పెంచుకుంటున్నారు. దాట్ల గ్రామానికి చెందిన కొంత మంది యువకులు కోళ్లను ఎత్తుకెళ్లి జల్సాల కోసం విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం దాట్ల గ్రామానికి చెందిన పచ్చిపాల మహేష్, బొందల వరుణ్, బోడబర్తి కార్తీక్, గోగుల వంశీకృష్ణ, గుండాల లక్ష్మణ్ కోళ్ల తీసుకువస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

మహబూబాబాద్: ముదిరాజ్ ఆర్థికంగా బలపడడంతోపాటు రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం గోపాలపురం పెద్దమ్మ తల్లి దేవాలయ ట్రస్ట్ క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ గుండెల రాజు, నాగరాజు, ఉప్పలయ్య, ఐలయ్య, నర్సయ్య, నారాయణ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

గూడూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన రాసమల్ల వెంకటేశ్వర్లును నియమిస్తున్నట్లు సోమవారం పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దవంగర/తొర్రూరు/తొర్రూరు రూరల్: పెద్దవంగర మండల అధ్యక్షుడిగా బొమ్మెరబోయిన సుధాకర్ యాదవ్, బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడిగా పైండ్ల రాజేష్, తొర్రూరు రూరల్ అధ్యక్షుడిగా మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన గట్టు రాంబాబును నియమించినట్లు పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి సోమవారం తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

పెద్దవంగర: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల వేతనాలు చెల్లించేలా ఇటీవల ప్రభుత్వం నిర్ణయంను హర్షిస్తూ సోమవారం మండలంలోని పోచంపల్లి జీపీ కార్యాలయం ఎదుట సీఎం, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు ఓరుగంటి సోమనర్సయ్య, ఎల్లప్ప, వెంకటయ్య, వెంకటమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

నూతన ఉద్యోగులకు సన్మానం

నెల్లికుదురు: నూతనంగా ఉద్యోగాలు పొందిన మండల కేంద్రానికి చెందిన 16మంది ఉద్యోగులకు కాకతీయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు అధ్యక్షుడు వేముల ఉపేందర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో అసోసియేషన్ 18వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి సోమవారం ప్రారంభించారు. గుమ్మడి మహేష్ జ్ఞాపకార్థం, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు రెండు రోజులపాటు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.

సన్మానం

కేసముద్రం: మండలంలోని తావుర్యాతండా జీపీలో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన ముడావత్ చైతన్య కుమార్‌ను, మాజీ సర్పంచ్ భుక్యా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు.

సంస్కృతికి ప్రతిబింబాలు రంగవల్లులు



మహబూబాబాద్ రూరల్: బహుమతులు అందజేస్తున్న వాసవి క్లబ్ కపుల్స్ బాధ్యులు



మహబూబాబాద్: ముగ్గులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ మాలోత్ కవిత



తొర్రూరు రూరల్: విజేతలకు బహుమతుల ప్రదానం..



నెహ్రూసెంటర్: బహుమతులను అందజేస్తున్న అజయ్‌సారథిరెడ్డి



గార్ల: మండలం రాంపురంలో బహుమతులు అందజేస్తున్న ఎస్సై



నర్సింహులపేట: పడమటిగూడెంలో..

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ముగ్గులను నాయకులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులతో పాటు నగదు అందజేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మన సంస్కృతికి ప్రతిబింబాలు రంగవల్లులు అన్నారు.

- సాక్షి నెట్‌వర్క్